
# 'త్యాగజీవి' ఆత్మకథ



**రానున్న అయిదేళ్ళ కాలంలో 20కి పైగా నీటిపారుదల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాని నిర్వాసితుల పునరావాస పథకాలు రూపొందించటం లేదు. రాష్ట్ర చరిత్రలో నిర్వాసితులు వీధులపాలైన ఉదంతాలు కోకొల్లలు. ఈసారి కూడా అంతే జరుగుతుందా? ఇటువంటి సంక్షోభానికి గురైన ఒరిస్సాలోని ఒక గ్రామ తెగ కథ ఇది.**

** ** **

**ఒరియా కథ: హృషీకేశ్ పాండా**
**ఇంగ్లీష్ నుంచి అనువాదం: టంకశాల అశోక్**

నా ప్రియమైన మనవలు, మనవరాళ్ళు, పిల్లలారా! సోదర సోదరీ మణులు, యువతీ యువకులారా! రైతులు, తెగపెద్దలు, జమీందార్లు, అధికార్లు, పెద్దలారా!- మీకందరికీ నేటి శుభసందర్భంగా ఈ ధనపూల పరజ సవినయంగా నమస్కారం చేస్తున్నది. మీ కందరికీ మేలగుగాక.

ఎక్కడ మొదలు పెట్టమంటారు? మనం ఈ రిపబ్లిక్‌డే ముప్ప య్యారేళ్ళుగా జరుపుకుంటున్నాము. ఆ సందర్భంగా ప్రతిసారి ఇదే విధమైన ఉపన్యాసాలు వింటున్నాము. ఈరోజు కూడా అలాంటిదే ఓ ఉపన్యాసం ఇవ్వబోతున్నాను నేను. మనం ఇటీవలి దాకా పరులకు దాస్యం చేసాము. అప్పుడు అడవుల్లో, అంధ కారంలో బతికాము. ఇప్పుడు స్వతంత్ర నాగరిక పౌరులం. అడవులను, అంధకారాన్ని నిర్మూలిం చుకున్నాము. మనకు కాకపోయినా ఎన్నో గ్రామా లకు విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పడింది.

లోగడ మనను వారు వీరని కాక అందరూ దోపిడీ చేసేవారు. మన భూమిలోని చెట్టునరికినా రాజుగారికి పన్ను కట్టేవాళ్ళం. మన చెట్లకు కాసిన కాయలు తినాలన్నా మనకు హక్కుం డేదికాదు. భూమిశిస్తు కట్టేందుకు వడ్లో, రాగులో అయిదేసి మైళ్ళు మోసుకుపోవాల్సి వచ్చేది. దసరా వచ్చినపుడు వారంరోజులు నడిచి పోయి రాజుగారి కొలువులో ఆడితే, పాడితే అందుకాయన ఏమీ ఇచ్చే వాడు కాదు. రాత్రికి మనను అక్కడ రోడ్లమీద పడుకొమ్మనేవారు. రాజుగారు ముప్పయ్యారు తెగలకు, మూడు కళింగ దేశాలకు ప్రభువని అనిపించుకునేందుకు అదంతా అవసరమనేవారు.

ఇంకా అప్పుడు భూమంతా తెగ పెద్దల చేతిలో ఉండేది. పట్టాలుం డేవి కావు. పెద్దకు తోచినపుడల్లా మనలను ఒకచోటి నుంచి మరోచోటకు తరలిపొమ్మనేవాడు. పల్లపు భూమి తీసుకుని రాళ్ళనేల ఇచ్చేవాడు. అసలది కూడా లేకుండా చేసి మనలను ఏదో ఒక నిజమైన అప్పుకో, ఉత్తుత్తి అప్పుకో బానిసల్ని చేసే వాడు. శిస్తుకు రసీదు ఇచ్చేవాడు కాదు. సంతల్లో బంది పోటు జరిగితే చెప్పుకునే దిక్కులేదు. రాజుగారు బందిపోట్ల దగ్గర తలకొక రూపాయి తీసుకుని లైసెన్స్‌లు ఇచ్చి, వాళ్ళు కూడా తన రాజ్యంలోని మనుషులే కదా అనేవాడు.

ఆ రోజుల్లో, పుట్టిన ఆడపిల్లల్లో సగం మందిని బలి ఇస్తుండేవారు. మనకు అది చాలదన్నట్లు, ఏయే పిల్లలు బలికి పనికి వస్తారో రాశులు చూసి చెప్పి, ముహూర్తాలు పెట్టి, బలులు చేసే పూజారికి ఆయనపడ్డ శ్రమ కింద అయిదు మానికల రాగులు, పసుపు కుంకుమలు ఇచ్చు కునేవాళ్ళం. మా ఆలోచనలు ఎంత వెనకబడి ఉండేయంటే, ఒక్కో సారి పని దొరికినా చేసేందుకు పోయేవాళ్ళం కాదు. ఒక్కపూట తిండి కి గింజలుంటే చాలు ఇక పెళ్ళికాని మగపిల్లలంతా పనిమాని తాడిచెట్ల వేపు పరిగెత్తేవాళ్ళు. పనులు దొరకని రోజుల కోసం ఎట్లా కాస్త కూడేసుకోవాలో మాకు తెలిసేది కాదు. కాస్త తిండుంటే చాలు పనిమాని ఆటపాట ల్లో వళ్ళుమరిచే వాళ్ళం.

వడ్డీల వాళ్లు, దోపిడీ చేసేవాళ్ళు ఉన్నా మాలో మాత్రం కూలినాలి తరగతంటూ ఉండేది కాదు. మేము అంత అనాగరికంగా ఉండేవాళ్ళం. కొడుకు పెళ్ళి చేస్తే ఆ ఖర్చుల కోసం తండ్రి వెట్టి బానిసయే వాడు. ఫారెస్ట్ వాళ్ళు ఎవరి నైనా అరెస్టు చేస్తే మొత్తం కుటుంబం బానిసయేది. శిస్తు కట్టలేని మనిషి బానిసయేవాడు. ఇపుడు వెట్టి రద్దయింది. కనీసం దాన్ని రద్దు చేస్తూ చట్టమొకటి వచ్చింది. అది అభ్యుదయానికి రుజువే మరి.


దేశానికి ఇక స్వాతంత్ర్యం రానుందనగా, మా ఊరిని ఉన్నచోటి నుంచి తరలిస్తారని పుకార్లొచ్చాయి. జనం పది జమీందారీల నుంచి పెద్ద జమీందారు భవంతికి పోయి ఆ మాట విన్నారు. అంతటా ఫ్యాక్ట రీలు వస్తాయని, దేశమంతా ఒకేసారి సిరిసంపదలతో నిండిపోతుందని అంతా పొంగిపోయారు. ఫ్యాక్టరీలైతే వచ్చాయి. చాలా మందికి ఉద్యోగాలు కూడా దొరికాయి. కాని మా తెగలో ఎవ రికీ దొరకలేదు. ఆ ఫ్యాక్టరీల్లో ఏం తయారవుతాయో కూడా మాకు తెలవదు. వాటిల్లో రాగి అంబలి, ఇప్పసారా, ఆము దం, చారల చీరలు, ఇళ్ళు- ఏవీ తయారుకావు. అసలక్కడ ఏం చేస్తారో, అవి ఎవరు వాడుతారో మాకు తెలవదు.

కథ

మా తమ్ముని పెళ్ళయినపుడు పదిహేనూళ్ళ జనానికి ఇప్పసారా పోసాం. దానికోసం మా వరిపొలమంతా తనఖా అయింది. మా తమ్ముడు వెట్టి బానిసయ్యాడు. మా నాన్న చిత్రమైన మనిషి. ఎప్పు డూ నవ్వుతుండేవాడు. ఆయన వెట్టి బానిసగా ఉన్నపుడు ఒకసారి వాళ్ళ దొరకు కోపమొచ్చి చితకబాదాడు. మా నాన్నకు స్పృహ తప్పి పోయింది. ఏడు గంటల తర్వాత ఆయనకు ప్రాణం పోయిందనుకుని

మరో నలుగురు బానిసలు ఇంటికి మోసుకొచ్చారు. తర్వాత ఆయనకు స్పృహ వచ్చి నవ్వు మొహం పెట్టాడు. తనెప్పుడూ నవ్వుతూనే, అదే పనిగా నవ్వటం మంచిదికాదని మమ్మల్ని అదిలిస్తుండేవాడు.

మా ఊర్లో అరవై ఇళ్ళుండేవి. దుడుమా దగ్గర ప్రాజెక్టు పని మొదలైనపుడు, మా ఊరు మునుగుతుందని పుకారు రేగింది. కాని, ఎవరూ నమ్మలేదు. ఒకసారి ట్రక్కులు, జీపులు మా ఇళ్ళ దగ్గరికొచ్చాయి. పిల్లలు అవి చూసి గంతులేసి ఏవేవో కథలు చెప్పారు. ప్రాజెక్ట్ పనితో జనానికి తిండికి సరిపడా పని దొరికింది. ఒకరోజు చక్రా జానీ పద్నాలుగేళ్ళ కొడుకు ట్రక్కుమీంచి పడి చనిపోయాడు. అది ప్రమాదం కాదు హత్య అన్నట్లు అందరూ ఆ మాట తొక్కిపెట్టేసారు.



నలుగురైదుగురు మగపిల్లలు సారా కాసి అమ్ముతుండేవారు. వారికొచ్చిందంతా పోలీసులను మేపటానికే సరిపోయేది. వాళ్ళు మాత్రం అలాగే దరిద్రంలో నవ్వుతూ గడిపారు. ముసిలాళ్ళు ప్రాజెక్టు వట్టి భ్రమ అనేవాళ్ళు. ఈ పిల్లలు అక్కడికి పనికి పోయేవారు కాదు. ఒకసారి పోసాజానీ కొండల్లో తన పొలానికి పోయాడు. ప్రాజెక్టు వాళ్ళు తోడిన మట్టంతా అక్కడ పోస్తున్నారు. జానీ ఆ మట్టి కుప్పల్లో కూరుకుపోయి ఇక ఇల్లు చేరలే. మగపిల్లలు, ఆడపిల్లలు చాలా మంది ఇళ్ళు వదిలిపోయి ప్రాజెక్టులో కూలీలుగా చేరారు. అక్కడ మా తెగ పిల్లొకర్తి, మరో తెగపిల్లాడితో పారిపోయింది. దాంతో మా తెగకు తలకొట్టేసినట్లయింది. ఆ పిల్ల ఇక తిరిగి రాలేదు. అట్లా అయిదారుగురు పోయారు, ఎటు పోయారో మరి.

నా జతగాడు బలేసోకుగా పాడేవాడు. ఆడితే వాడి సన్నటి నడుం సోకుగా కదిలేది. వాడు నాతో తనకు ఎవరన్నా భయం లేదనేవాడు. వడ్డీ షావుకారు, తెగపెద్ద, కంట్రాక్టర్, ఆయన గుమాస్తా, ట్రక్ డ్రయివర్లు, పెద్దోళ్ళ నుంచి ఉత్తరువులు తెచ్చే ఊరి బంట్రోతు, రెవెన్యూ వాళ్ళు, ఫారెస్ట్ వాళ్ళు, కోమటాయన, దయ్యాలు, నేనూ తప్ప మరి ఎవరన్నా భయంలేదనేవాడు.

ఒకసారి శిశిరం వస్తుండగా రేలపూలతో కొండలన్నీ పసుపు పసుపు అయిపోయాయి. పల్లపు భూముల్లో వరి, మెట్టలో రాగులు, పప్పులూ వేసారు.

"రేల పూలు అంత పసుప్పచ్చగా ఎందుకున్నాయి?" అని అడిగాను నేను.

"ఓ నా పచ్చటి రాణీ, వాటికి నిన్ను చూసి కన్నుపట్టింది" అన్నాడు నా జతగాడు.

"రాగులు ఈసారి ఇంతగా ఎందుకు పండాయి?" అని అడిగాను.

"నీ పూలకొప్పు బరువు చూసి అసూయపడ్డాయి" అన్నాడు వాడు.

అందరం కలిసి అక్కడ ఆడాము, పాడాము. ఆ సంబరంలో, అయ్యో అడవి ఏమైందా, ఆడా- మగకు చాటేదీ లేకపోయెనే అని మేము విచారపడుతుండగా ఊరి బంట్రోతు వచ్చి, నిన్ను తెగ పెద్ద ఉన్నపళంగా రమ్మంటున్నాడని నా జతగాణ్ణి పిలిచాడు. ఈ వేళన పిలవడమేమిటి, నాకేదో గుబులుగా ఉంది, పోవద్దన్నాను నేను. దానికి, నాకెవరన్నా భయంలేదు, నీ చక్కదనాల మొఖాన్ని నీళ్ళలో చూసుకుంటుండు, నిముషంలో తిరిగొచ్చేస్తాను అన్నాడు వాడు.

అట్లా అని వాడు బంట్రోతుతో పోగా నాకు ఎదురుచూసి, ఎదురుచూసి ఓపికపోయి, కోపం వచ్చింది. ఇక వాడితో పలకొద్దని, తిరిగొచ్చినపుడు కయ్యం వేసుకోవాలని, మీదపడి రక్కాలని అనుకున్నాను. అట్లా అనుకుంటుండగానే రోజు గడిచిపోయింది. సాయంత్రమై, రాత్రి కూడా అయింది. అప్పుడు, పెళ్ళికాని ఆడపిల్లలుండే పెద్ద వసారాకు తిరిగిపోతే, ఉద్యోగం బదిలీ అయిన ఫారెస్ట్ బాబు తన సామాన్లు మోసేందుకు వెట్టికూలీలు కావాలన్నాడని, అందుకోసం మరో ఇద్దరితో పాటు నా జతగాడూ పోయాడని చెప్పారు. మూడురోజుల తర్వాత వస్తాడన్నారు కాని రాలేదు. మూడు నెల్ల తర్వాత అదే బంట్రోతు వచ్చి, వాడి అరెస్టుకు పోలీస్ వారంటు వచ్చిందన్నాడు. ఆ మాట వినగానే, నా జతగాడు వెట్టి పని ఇష్టంలేక అస్సాం పారిపోయి ఉంటాడనుకున్నాను. ఫారెస్ట్ బాబు వాడిమీద దొంగతనం కేసు పెట్టాడు.

మా ఊళ్లో ఎవరు భూమి సేద్యం చేస్తారన్నది అందరికీ తెలిసిందే. అందుకని పట్టా రికార్డులు, శిస్తు రసీదులు ఏవీ ఉండేవి కావు. అటువంటి పరిస్థితిలోమా ఊరి భూములు ప్రాజెక్టు కింద నిజంగానే మునిగిపోతాయని తెలవడంతో అంతా గందరగోళమైంది. ఆఫీసర్లొచ్చి "పోండి, ఎక్కడికి కావాలంటే అక్కడికి పోండి. ఇక్కడ మాత్రం ఉంటానికి వీల్లేదు" అని ఆర్డరిచ్చారు. ఎవరో కొండవతలికి పొమ్మన్నారు. ఇంకెవరో నది అవతల మీకోసం భూములున్నాయి, అక్కడికి పోండి అన్నారు. అవన్నీ విని మాకెంత అయోమయం, భయం అయిందంటే, ఆఫీసర్ ఎవరన్నా వస్తే చాలు కొండ అవలికి పారిపోయే వాళ్ళం. ఎందుకీ జంజాటమంతా అనుకునేవాళ్ళం. ఆఫీసర్ల ముందు ఒక్క తప్పు మాటంటే చాలు, ఒక్క తప్పు చేస్తే చాలు ఇక బతుకంతా పీడే. మేమంతా పారిపోతే, అరవయ్యేళ్ళ శంబరి పరజ ఒక్కతే ఊళ్ళో ఉండేది. వచ్చినవాళ్ళు ఆమె వేలిముద్రలు వేయించుకుని పోయే వాళ్ళు.

ఆఫీసర్ ఎవరన్నా వస్తే చాలు కొండ అవలికి పారిపోయే వాళ్ళం. ఎందుకీ జంజాటమంతా అనుకునేవాళ్ళం. ఆఫీసర్ల ముందు ఒక్క తప్పు మాటంటే చాలు, ఒక్క తప్పు చేస్తే చాలు ఇక బతుకంతా పీడే. మేమంతా పారిపోతే, అరవయ్యేళ్ళ శంబరి పరజ ఒక్కతే ఊళ్ళో ఉండేది. వచ్చినవాళ్ళు ఆమె వేలిముద్రలు వేయించుకుని పోయే వాళ్ళు.

ఒక రాత్రి మేము వెన్నెల్లో అదే పనిగా పాడి పాడి, అంబట్లో ఎండ్రకాయలు ఉడకబెట్టుకుని, ఆట్లాడి ఆకుల్లో పూలు పోసి, అడవి తేనెలు- రేగుపళ్ళు- ఇప్పపూవు- చింతచెట్ల వాసనలు నిండిన గాలి పీలుస్తూ ఇంకా, ఇంకా పాడాము. "ఈ ఊరి చెట్లకు పచ్చనాకులు ఇంకా వేస్తాయని, విరగపండిన వరిని చూసి పెళ్ళికాని వేరే ఊళ్ళ పిల్లలంతా తమదారి మరిచి ఇటే వస్తారని, తాటి చెట్లకు రసం ఊరి ఊరి అందరి దప్పిక తీరుస్తుందని, ఏ మగపిల్లవాడూ కూలికి పోనక్కర్లేదని" అంటూ పాడాము. ఓ తల్లీ శనాక్రైథూనీ, నీ పూజకెప్పుడైనా లోటు చేసామా తల్లీ? అని వేడు కున్నాము.

ఆటపాటలు అయినాక నిద్రలకు అందరం పోయాము. అపుడు, అర్ధరాత్రివేళ ఆరు ట్రక్కులొచ్చాయి. వాటితో ఒక పోలీస్ ట్రక్కొచ్చింది. మమ్మల్నంతా ఒక ట్రక్కులోకి ఎక్కించి అడవిలో ఎక్కడో దింపితే లబోదిబోమని ఏడ్చాము. దింపిన చోటనే ఆ రాత్రి ముడుచుకుని కూర్చున్నాము. పొద్దున చూడగా, అరవై కుటుంబాల్లో ముప్పయి మూడిళ్ళవారే అక్కడున్నారు. తక్కిన వారిని ఎటు తీసుకుపోయారో! రాని వాళ్ళలో చైతీ జానీ పసిపిల్లలు ఇద్దరున్నారు. అందుకని జానీ, ఆయన భార్య ఊళ్ళోకి పోవాలనుకుంటే అందుకు మూడునెలలు పట్టింది. కాని అప్పటికి ఊరే లేదు. నీటి కింద మునిగిపోయింది.

జానీ, ఆయన భార్య పిచ్చివాళ్ళలా షావుకారు ఇంటికిపోయారు.

షావుకారు మొత్తం ఊరి రికార్డులు తయారు చేయించుకుని, మునిగిన భూములకు నష్ట పరిహారమంతా తనే కాజేసాడు. పెద్ద ఇల్లు కొన్నాడు. ఆయన చైతీ జానీతో, "అరె పిచ్చివాళ్ళులా ఉన్నారే! మళ్ళీ పిల్లల్ని కనటం ఎంతసేపు?" అన్నాడు. షావుకారు మంచి మనిషి. ఆయన తను ఉంచుకున్న మా పరజా తెగపిల్లను చాలామంది ఆఫీసర్లలాగా వెళ్ళగొట్టలేదు. ఆఫీసర్లు ప్రాజెక్టు పని అవగానే పరజా భార్యల్ని వదిలిపెట్టిపోయేవారు.



మా ముప్పయి మూడు కుటుంబాల్లో నాలుగు ఆంధ్రప్రదేశ్ పోయాయి. రెండు కిరస్తానీ మతం తీసుకుని ఇంకెటోపోయాయి. తక్కిన ఇరవై ఏడు గురం కాస్తంత అడివి నరికి స్థిరపడ్డాం. మగపిల్లలెవరూ మా నాన్న ను కలిసి నన్ను పెళ్ళాడతాననలేదు. మేము భూమి సాగుచేసినాక, మాలాగే భూములు పోగొట్టుకున్నవారు ఇంకా వస్తుండటంతో ప్రభుత్వం వారి కోసం పునరావాస పథకం మొదలు పెట్టింది. అప్పుడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వచ్చి మమ్మల్ని పట్టా హక్కులు చూపమన్నాడు. మా దగ్గర కాగితాలెక్కడివి? తప్పుమాదే, ఎవరినీ ఏమనలేము. దానితో ఇన్‌స్పెక్టర్ "ఇది వరకు నాకు అధికారం ఉండేది, ఇపుడేం లేదు. మీరు ఇంకా లోయలోకి కిందికిపోయి నది ఒడ్డున సాగుచేసుకోండి అన్నాడు. అప్పటికే మేం కాస్తంత అడివి నరికి స్థిరపడ్డామన్నాను గదా. అయినా చేసేదేముంది.

ఇరవై ఏడు కుటుంబాల్లో పది అట్లా లాభంలేదని మెయిన్ రోడ్డు దగ్గర స్థిరపడ్డాయి. అక్కడ దుఖీ జానీ తాగుడుకు అలవాటు పడి, దానికోసమని భార్యను ఫారెస్ట్ బాబుకు వదిలాడు. సెటిల్మెంటులోని ముసలాళ్ళంతా అది చూసి "ఓ, ఓ" అని బాధపడ్డారు. కాని చేయగలిగిందేమిటి? అయితే ఫారెస్ట్‌బాబు అడ్డూ అదుపూ లేకుండా ఒకనాడు దుఖీ జానీ ఇంట్లో పట్టపగలే జొరబడి, అందరూ చూస్తుండగా అతని భార్యను వరండాలో చెరిచాడు. దానితో నలుగురూ కోపం పట్టలేక వాడ్ని తన్నారు. వాడు అందరి మీద హత్యా ప్రయత్నం కేసు, కలప దొంగతనం కేసు పెట్టాడు.

అది తట్టుకోలేక ఆ పది కుటుంబాలూ ఎక్కడికో పారిపోయాయి. ఇక పదిహేడు కుటుంబాలు మిగలగా ఒకరోజు అసలే తిరుగుబోతైన భవ బినోదియా పరజ, మళ్ళీ ఎటో పోయాడు. ఆయన కుటుంబంలో తనొక్కడే. శంబరి పరజకు కూడా ఇంకెవరూ లేరు. తమ్ముడున్నాడుగాని మమ్మల్ని ట్రక్కులో తెచ్చిన రాత్రి వాడు రాలేదు. అయితే కొలాబ్ నదికి ఎగువన ఏదో ఉపనది లంకల్లో సాగు చేస్తుండేవాడని, ఒక రాత్రి నదికి వరదొచ్చి మంచెతోపాటు కొట్టుకుపోయాడని తర్వాత తెలిసింది. కనుక శంబరికి ఎవరూ లేరిక. ఆమెకు పనేమీ దొరకలేదు. ఆమె ఒంట్లో సత్తువ లేక అడవికి పోయి కాయలు, దుంపలు, ఇప్పపూవు లాంటివి ఏరలేకపోయేది. దుడుమా ప్రాజెక్టు దగ్గర బావి ఒకటుండేది. దానికి తాగుబోతు ఒకడ్ని కాపలాకు పెట్టారు. శంబరివాడికి వండిపెట్టి అక్కడే ఉండేది. ఒకనాడు ఆ మనిషి బాగా తాగి బావిలో పడి చచ్చాడు. దానితో శంబరి పరజ మా తెగ రెండు వేలేళ్ల చరిత్రలో మొట్టమొదటి బిచ్చగత్తె అయింది.

మా ముప్పయి మూడు కుటుంబాల్లో
నాలుగు ఆంధ్రప్రదేశ్ పోయాయి.
రెండు కిర స్తానీ మతం తీసుకుని
ఇంకెటో పోయాయి. తక్కిన ఇరవై
ఏడుగురం కాస్తంత అడివి నరికి
స్థిరపడ్డాం. మగపిల్లలెవరూ మా నాన్న
ను కలిసి నన్ను పెళ్ళాడతాననలేదు.
మేము భూమి సాగుచేసినాక, మాలాగే
భూములు పోగొట్టుకున్నవారు ఇంకా
వస్తుండటంతో ప్రభుత్వం వారి కోసం
పునరావాస పథకం మొదలు పెట్టింది.

తర్వాత బలిమెల ప్రాజెక్ట్ కట్టినపుడు మా మిగిలిన పదిహేను కుటుంబాల ఇళ్ళు మునిగిపోయాయి. మాకు రికార్డులు లేవని చెప్పి వేరే భూములుగాని, నష్టపరిహారం గాని ఇవ్వలేదు. అదేరోజుల్లో మహరాజ్ పరజను కోడిపెట్ట దొంగతనమంటూ జైల్లోవేసారు. ఆయన్ని ఏ కేసూ విచారణా లేకుండా మూడేళ్ళు అక్కడే ఉంచారు. అట్లా మహరాజ్ పరజ మా తెగ రెండు వేలేళ్ళ చరిత్రలో మొట్టమొదటి దొంగ అయాడు.

కేడియా అండ్ కంపెనీ వాళ్ళు మా ప్రాంతంలో కొన్నేళ్ళుగా దొంగతనంగా కలప నరికి బయటకు చేరవేసేవారు. ఒకసారి బయట ఢిల్లీ నుంచో ఎక్కడినుంచో వచ్చిన ఆఫీసరొకాయన వాళ్ళ కలప డిపో చూసాడు. కలెక్టర్ పరజ (జిల్లా కలెక్టర్ మా ఊరికి వచ్చిన రోజునే వీడు పుట్టాడు. అందుకని వాడికి ఆ పేరు పెట్టి అదృష్టం కలసి వస్తుందన్నారు) లోగడ ఈ కంపెనీకి రెండు చెట్లు అమ్మాడు. వాటికి ముప్పయి రూపాయలిస్తానన్న కంపెనీ గుమాస్తా పది ఇచ్చి, మిగతావి ఇచ్చేందుకు టలాయించాడు. కలెక్టర్ పరజ డిపో దగ్గరకు పోయేసరికి గుమాస్తా మాయమయ్యాడు. ఆసరికి అక్కడున్న బయటి ఆఫీసరును, తన డబ్బివ్వమని అడిగాడు పరజ.

"ఎవరు నువ్వు?" అన్నాడా ఆఫీసర్.

"కలెక్టర్‌ను" అని జవాబిచ్చాడు పరజ.

"పరిహాసమాడుతున్నావా?"

"లేదు దొరా"

"ఈ చెట్లు నువ్వే సరికావా? ఈ కలప నీదేనా?"

"లేదు దొరా"

అప్పటికి ఆఫీసర్ మొహం కందగడ్డలా అయింది. అది గమనించి "లేదు దొరా" అని కాస్త భయంగా మళ్ళీ అన్నాడు పరజ.

"మరి ఎవరు నరికారీ చెట్లు?"

"లేదు దొరా"

"అబద్ధమాడుతున్నావా?"

"లేదు దొరా"

ఇట్లా జరిగింది వారి సంభాషణ. ఆఫీసర్ కలెక్టర్ పరజను అరెస్ట్ చేసి తీసుకుపోయాడు. డిపోలో భారీగా కలప దుంగలు పట్టుకున్నందుకు ఆఫీసర్ల ఫోటోలు పేపర్లలో వచ్చాయి. వారి మధ్య చేతులకు బేడీలతో కలెక్టర్ పరజ కూడా ఉన్నాడు.

కొన్నాళ్ళు గడిచాక డిపో గుమాస్తా తిరిగి వచ్చాడు కాని, కలెక్టర్ పరజ భార్య, సునానకీ పరజ, తన భర్తను దొంగకేసులో ఎందుకు ఇరికించారని ఆయన్ని అడగలేదు. ముప్పయ్ ఇస్తానని పదే ఇచ్చావు, మిగతా డబ్బివ్వమని మాత్రం అడిగింది.

గుమాస్తా తన జేబులోంచి కాగితం ఒకటి తీసి, ఏదో పెద్దగా చదివి, ఒక చోట వేలు పెట్టి చూపుతూ, "చూడు, చూడు. ఇస్తానన్న ముప్పయ్ మొత్తం ఇచ్చేసాను మీ ఆయనకు. కాదంటే రాత్రికి రా. ఏదో ఒకటి చూస్తాను" అన్నాడు.

"ఇచ్చానంటున్నావు గనుక ఇచ్చే ఉంటావు. రమ్మంటున్నావు గనుక వస్తాను" అంది సునానకీ పరజ.

మామూలుగానైతే ఆమె అసలు ఒప్పుకోకపోయేది. కాని తిరిగి తిరిగి వేసారి, సాగుచేసిన భూమిని ప్రతిసారీ పోగొట్టుకుని, భర్త జైల్లో ఉండి, దాదాపు మతిపోయిన ఆమెకు అంతకన్న ఏం చేయాలో తెలియలేదు. ఆ రాత్రి ఆమె గుమాస్తా దగ్గరకు పోయి ఇక తిరిగి రాలేదు.

మిగిలిన పధ్నాలుగు కుటుంబాల్లోనూ ఏడింటి నుంచి ఎవరో ఒకరు, ఎక్కడో ఒకచోట వెట్టి పనికి పోయారు. బలిమెల ప్రాజెక్టు కట్టినాక, ఆ కుటుంబాల్లో మిగిలినవాళ్ళు కూడా వారితోపాటు వెట్టికి పోయారు. ఇక్కడుండి చేసేదేముంది గనుక?

చివరకు మిగిలిన ఏడు కుటుంబాల వాళ్ళం బలిమెల ఆవలికి పోయాం. అక్కడ మా తెగ వాళ్ళు ఎవరూ లేరు. మా భాష ఎవరికీ అర్థం కాదు. అక్కడ రెండు కొండల మధ్య మేమే చిన్న పల్లె పొందించుకున్నాం. అక్కడ పగలు మంటలు, పొగలు వేయొద్దని, దూరాన్నించి ఎవరైనా చూస్తారని మా తెగ పెద్ద హెచ్చరించేవాడు మమ్మల్ని.

ఒకనాడు క్రిస్టాబాసీ బాగ్ అనే ఆయన వచ్చి మాకు భూములు ఇప్పిస్తానన్నాడు. ఆ వెనుక

కేడియా కంపెనీ గుమాస్తా, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వచ్చి అందరి పేర్లు, తండ్రుల పేర్లు రాసుకుని, భూములిప్పిస్తామన్నారు. ఏడుగురి వేలిముద్రలూ వేయించుకుని ఫలానా రోజున రమ్మన్నారు. ఆ రోజున మావాళ్ళు ఏడుగురూ గుమ్మడికాయలు, కోళ్ళు తీసుకునిపోయారు. అక్కడ ఆఫీసర్ అడిగిందేమిటో అర్థంకాక, ప్రతిదానికి తలూపారు. వాళ్ళు చూపిన భూమిలో అడవి నరికి సాగు చేసారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శిస్తు వసూలుకు వచ్చాడు. మాలో దివాన్‌సింగ్ జానీ కుటుంబీకులు పూర్వం హోదాతో బతికినవాళ్లు. ఆయనకు కాస్త అభిమానం, అహంకారం ఉండేవి. అది చూసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు కోపం వచ్చి ఆయన పైన భూముల ఆక్రమణ కేసు పెట్టి, రెండువేల జుర్మానా వేసాడు. జుర్మానా నోటీస్ అందటంతో అతనికి ముఖం పాలిపోయి, ఊరొదిలిపోయాడు.

**ఊరి పెద్దతో పోయిన క్రిస్టాబాసీ తిరిగి రాలేదు. ఆయన భార్య మళ్ళా పెళ్ళాడి వెళ్ళిపోయింది. వ్యవసాయం బాగా తెలిసిన గోరా జానీ భూమిని బాగా సాగులోకి తెచ్చి నాగలి, ఎద్దులు సంపాదించాడు. అయితే, అందుకు మొదట్లో చేసిన అప్పు తీర్చటానికి కోతల తర్వాత బండెడు వడ్లు, బండెడు రాగులు, బండెడు గడ్డితో షావుకారు ఇంటికిపోయాడు.**

ఒకనాడు తెల్లవారేసరికి బుద్ధూజానీ, రామ్ జాని అనే ఇద్దరు కోడెల్లాంటి మగపిల్లలు మాయమయ్యారు. పోలీసులు వచ్చి రామ్‌జానీ భార్యను, మిగిలినవాళ్ళను గుచ్చిగుచ్చి అడగటంతో, వాళ్ళిద్దరు నక్సలైట్లలో చేరినట్లు బయట పడింది. ఒకరోజు మా నాన్నకు రామ్‌జానీ ఎక్కడో కన్పించి, భార్య కోసం కాస్త డబ్బు పంపాడు. అదే రాత్రి పోలీసులు వచ్చి మా నాన్నను, రామ్‌జానీ భార్యను పట్టుకుపోయారు. అప్పటికి నాకింకా పెళ్ళికాలేదు. (వయసు మీరింది కూడా) అందుకని నన్ను వదిలిపెట్టారు.

ఒకసారి క్రిస్టాబాసీ మా తెగ పెద్దను కలిసి (ఆయన పేరుకే ఊరి పెద్ద) ఆ రాత్రికి బుద్ధూ జానీ ఊళ్ళోకి వస్తాడని, ఆ సంగతి పోలీసులకు చెప్పాలని, లేనట్లయితే పోలీసులు ఊరినంతా వేధిస్తారని హెచ్చరించిపోయాడు. మా తెగ పెద్ద ఒకప్పుడు పేరూ పలుకుబడి ఉండిన మనిషి, చుట్టుపక్కల పన్నెండు జమీందారీల్లో ఆయనకు మర్యాద ఉండేది. ఆయన్ను నందపూర్ రాజా దసరా రోజుల్లో దర్బారుకు పిలిపించేవాడు. ఆయన అధికార్లతో, జమీందార్లతో అదే ఫాయాలో మాట్లాడేవాడు. కాని తర్వాత అంతా పోయింది. అధికారం, తెగలో వాళ్ళకు భూములు పంచటం, శిస్తు వసూలు, తీర్పులు చెప్పటం అంతా పోయింది. అయినా మనిషికి ప్రభు భక్తి పోలేదు. అందువల్ల ఆ రాత్రి బుద్ధూ జానీ రాగానే, ఊరి బంట్రోతును తీసుకుని అదే రాత్రి పోలీస్‌స్టేషన్‌కు అంటూ పోయాడు. కాని, తిరిగిరాలేదు. మర్నాడు తెలతెలవారుతుండగా ఇద్దరు మనుషులు తుపాకులతో వచ్చి, ఆయన భార్యను లేపి, "మీ ఆయన ఇకరాడు. ఈ విషయం ఎవరైనా పోలీసులకు చెపితే వాళ్ళ గతి కూడా ఇంతే అవుతుంది" అని బెదిరించిపోయారు.

దానితో తెగ పెద్ద భార్య భీతిల్లిపోయింది. ఆ వచ్చింది దయ్యాలనుకుని వెంటనే తలుపులు మూసి, దేవతలకు కోడిని బలిస్తానని మొక్కుకుంది. అయితే ఆ కొత్త ఊళ్ళో గ్రామదేవత అంటే భూమిలో పాతిన ఓ దుంగ ముక్క అన్నమాట. మరి ఆమెను పూజలు, పునస్కారాలతో ప్రతిష్టించనందుకో ఏమో ఈ ప్రార్థనలను ఆమె ఆలకించలేదు. తెగ పెద్ద ఎప్పటికీ రాలేదు. అతని దేశ సేవకు, త్యాగ నిరతికి గుర్తింపుగా అవార్డు ఇవ్వాలనుకుంది ప్రభుత్వం. ఆయన కొడుకు సాహెబ్ జానీకి పోలీస్ డిపార్ట్‌మెంటులో చప్రాసీ ఉద్యోగం ఇచ్చారు.

సాహెబ్ జానీ తిక్క మనిషి. ఉద్యోగంలో ఉండే క్రమశిక్షణ ఆయనకు ఎన్నడూ సరి పడలేదు. రాత్రిళ్ళు దొంగల్ని కనిపెట్టడానికి బదులు, పెళ్ళికాని ఆడపిల్లలు పడుకునే పెద్ద వసారాల గురించి కలలు కనేవాడు. ఉదయం తయారై ఉద్యోగానికి పోవటానికి బదులు తాడిచెట్ల గురించో, బాణాల్తో అడవి లో వేటాడటం గురించో ఆలోచించేవాడు. జీతాల నాడు ఊరికి వచ్చి అందరికీ తాగ పోసి, తర్వాత వారం రోజులు ఆఫీసుకు పోయేవాడు కాదు.

ఒక రాత్రి జీతం తీసుకుని ఊరికి వస్తుండగా ఊరి చౌకీదారు ఆపి, ఏయ్ ఎవరు నువ్వన్నాడు.

"లేదు దొరా" అని సాహెబ్ జానీ జవాబు.

"అబద్ధాలాడుతున్నావా? సరే రూపాయి తియ్యి"

"రూపాయా? ఎందుకు? లేదు దొరా"

"దొంగతనం చేసావా లేదా? నిజం చెప్పు. లేకుంటే పోలీస్‌స్టేషన్ తీసుకుపోతా."


సాహెబ్ జానీ వణికిపోయాడు. "లేదు దొరా తీసుకుపోవద్దు. నేను ఇన్‌స్పెక్టర్ సాబ్ చప్రాసీని. ఆయనకు చెప్పకుండా వచ్చానని తెలిస్తే ఉద్యోగంలోంచి తీసేస్తాడు" అని బతిమాలాడు.

అటువంటప్పుడు ఏంచేయాలో చౌకీదారుకు బాగా తెలుసు. "అచ్చా! అయితే నువ్వు ఇన్‌స్పెక్టర్ సాబ్ చప్రాసీవా? అలాగవుతే నీది స్పెషల్ వ్యవహారం అన్నమాట. సరే, రెండు రూపాయలు తియ్యి" అని దబాయించాడు. సాహెబ్ జానీ రెండు రూపాయ లిచ్చాడు. ఇచ్చి ఎంత భయపడిపోయాడంటే ఇక ఆ తర్వాత ఉద్యోగానికే పోలేదు.


ఆనాటి రాత్రి సాహెబ్ జానీ పెళ్ళికాని అమ్మాయిలు, అబ్బాయిలందరికీ (అందరూ అంటే ఇద్దరాడ పిల్లలు, ముగ్గురు మగపిల్లలు; అప్పటికే వయసుమీరిన నేనూ. మా కుటుంబాల్లో మిగిలినవాళ్ళం అంతే) బాగా తాగబోసాడు. పోసి, "చూడండి, మా పూర్వీకులు నలుని వంశం వాళ్ళు. పెద్ద రాజ్యం ఉండేది మాకు. తాను పెద్ద సాహెబ్‌ను అంటుంటాడు మా పోలీసాఫీసరు. మా పూర్వీకులు ఇంకా పెద్ద సాహెబ్‌లు. అశోకచక్రవర్తి అంతటివాడు మా వాళ్ళను జయించలేకపోయాడు. మీకు చెప్పినా అర్థంకాదు. ఆయన నలవంశాన్ని ఓడించలేకపోవటంతో బౌద్ధమతం తీసుకుని, మా వాళ్ళను కుయుక్తులతో, తన వేపు తిప్పుకోవాలని చూసాడు. కాని ఇదంతా మీకు అర్థమయేది కాదు" అన్నాడు. మాకు నిజంగానే ఏదీ అర్థంకాలేదు.

"మీరు విచారిస్తున్నారా? తక్కువ వాళ్ళం అనుకుంటున్నారా? లేదు, లేదు. మీరు కూడా నలవంశం వాళ్ళే. సంబరం చేసుకోండి" అని కూడా అన్నాడు సాహెబ్ జానీ.

ఊరి పెద్దతో పోయిన క్రిస్టాబాసీ తిరిగి రాలేదు. ఆయన భార్య మళ్ళా పెళ్ళాడి వెళ్ళిపోయింది. వ్యవసాయం బాగా తెలిసిన గోరా జానీ భూమిని బాగా సాగులోకి తెచ్చి నాగలి, ఎద్దులు సంపాదించాడు. అయితే, అందుకు మొదట్లో చేసిన అప్పు తీర్చటానికి కోతల తర్వాత బండెడు వడ్లు, బండెడు రాగులు, బండెడు గడ్డితో షావుకారు ఇంటికిపోయాడు. అయితే, అది పోగా ఇంకా చాలా అప్పున్నట్లు షావుకారు లెక్కలు తేల్చటంతో ఇంకా ఇచ్చేందుకేమీ లేక వెట్టి బానిసయ్యాడు. నందా చిన్నకొడుకు (వాడికి వేసెక్టమీ చేసారు) ఏదో పండగ నాడు పక్షుల వేటకు పోయి పాడుతూ తిరిగొచ్చాడు. వచ్చి కాస్త రాగం బలి తాగి నెగడి పక్కన పడుకున్నాడు. పడుకున్నవాడు పడుకున్నట్లే ఉండిపోయాడు. సునాధర జానీ భార్యాపిల్లలతో పాటు కిరస్తానీ మతం తీసుకున్నాడు. తన పేరు సునాధరజాన్ అని మార్చుకున్నాడు. వాళ్ళిచ్చిన డబ్బుతో ఏదో బతికాడు. అయితే మా పాటలన్నీ మరిచిపోయాడు.



ఇరవై ఆరో రిపబ్లిక్‌డే నాడు సాహెబ్ జానీ భార్య ప్రసవించాల్సి ఉంది. ప్రసవించాల్సిన వాళ్ళు మిగిలినవారికి దూరంగా ఆకుల గుడిసెలో ఉండటం మా సంప్రదాయం. ఆమె అలాగే



చేసింది. అయితే మైల రక్తం బయటపడకపోవటంతో ఎనిమిది రోజుల పాటు వండుకోలేదు, తినలేదు.

అదే దినాన అస్లాంఖాన్ కొడుకు ఇస్మాయిల్‌ఖాన్ మా ఊరొచ్చాడు. అతనికి యాభైఏండ్లు. ఆరుగురు పిల్లలు. హైదరాబాద్‌లో మూడు పెళ్ళిళ్ళు జరిపి, ఒక హత్య చేయించాడట. ఆయన రెవెన్యూ డిపార్ట్‌మెంట్ సర్వేయర్‌ను వెంటబెట్టుకుని, మొత్తం ఊరి భూములు, రాళ్ళభూములు, పల్లపు భూములు, కొండలు, అడవులకు పట్టా రికార్డులన్నీ తెచ్చాడు. సర్వేయర్ ఏదో ఏదో చెప్పాడు. అందరూ అవునన్నట్లు తలూపారు. పోయిన ఇరవైఏళ్ళ నుండి ఇవన్నీ చూస్తున్న వాళ్ళు ప్రతిదానికి అవును అవునన్నట్లు గట్టిగా తలలూపారు. "మమ్మల్ని వెళ్ళగొట్టదలుచుకుంటే ఆ పని చేసేయండి దొరా. దానితో పోయేదేముంది గనుక. కాని, పులి మేక పిల్లను చంపేముందు చెలగాటమాడినట్లు ఇదంతా చెప్పాలా?" అని వాళ్ళు నోటిమాటతో అనలేదంతే.

తర్వాత, ఏడు కుటుంబాల్లోనూ రెండు ఆంధ్రప్రదేశ్ పోయాయి. మూడు అడవిలోకి పోగా వాళ్ళలో ఒకరిని పులి నోట వేసుకుంది. ఒకరు మలేరియాతో చావగా, ఒకరికి విషపు దుంపలు తిని ప్రాణాలు పోయాయి. ఆ మూడు కుటుంబాలూ అట్లా నాశనమయాయి. ఖాన్‌సాబ్ దయగల మనిషి. ఒకర్ని బానిసగా పెట్టుకుని కొన్నాళ్ళు బతికించాడు. ఇకపోగా చివరకు మా నాన్న, నేనూ మా తెగకూ, సంస్కృతికీ వేల సంవత్సరాలుగా స్వతంత్రంగా స్థిరపడి వ్యవసాయం చేస్తున్న మా వారసత్వానికి గుర్తుల్లా అక్కడి నుంచి వచ్చేసి, తనో ప్రాజెక్టులో, నేనో ప్రాజెక్టులో రోజు కూలీలుగా పని చేసాం.

నా వంట్లో సత్తువున్నంత వరకు రోజూ కాకపోయినా కూలిపని దొరుకుతూనే ఉండేది. నాకు ఎపుడన్నా సుఖం కావాలన్నా సుఖపడేదాన్ని. కాని నా జతగాడ్ని ఎప్పుడూ మర్చిపోలేకపోయాను. అట్లాటి వాడు మా మొత్తం తెగలో ఇంకెవరూ కనపడలేదు నాకు.

రోడ్డు ప్రాజెక్టు అయిపోయినాక మా నాన్న, నేను రైల్వే ప్రాజెక్టులో పనిచేసాం. అక్కడ మట్టితెచ్చి గుట్టల్లా పోస్తుండేవారు. ఒకనాడు మా నాన్న మట్టిగుట్ట మీంచి జారిపడి చచ్చిపోయాడు. నేను గుండె పగిలేట్లు ఏడ్చాను. ఏడుస్తుండగా కాంట్రాక్టర్ గుమాస్తా మరో అయిదుగురు మొగాళ్ళు, ఆడాళ్ళతో వచ్చి, "ఏయ్, అంత ఏడ్వకు. పోలీసులు పట్టుకుపోతారు" అన్నాడు. మిగిలినవాళ్ళు కూడా అదే అన్నారు.

అప్పటి నుంచి నేను మాటా పలుకూ లేని దాన్నయాను. రైల్వే లైను, లెవెల్ క్రాసింగ్ పెట్టాక, నేనా క్రాసింగ్ దగ్గర కూర్చుంటుండే దాన్ని. అక్కడ చౌకీదారు మంచి మనిషి. దక్షిణం నుండి వచ్చినోడు. విచారాలు మర్చిపోవాలంటూ తప్పతాగుతుండే వాడు. రైలెప్పుడు వస్తుందో నాకెప్పుడూ తెలిసేది కాదు. కాని చౌకీదారుకు తెలుసు. వచ్చేముందు నాకు సైగ చేసేవాడు. నేను గేటు మూసి, రైలు పోయినాక మళ్ళీ తీసేదాన్ని. రోజులట్లా గడిచాయి. చౌకీదారు వెళ్ళిపోయాడు. చచ్చిపోయాడన్నారెవరో.

అప్పటి నుంచి నేను మాటా పలుకూ లేని దాన్నయాను. రైల్వే లైను, లెవెల్ క్రాసింగ్ పెట్టాక, నేనా క్రాసింగ్ దగ్గర కూర్చుంటుండే దాన్ని. అక్కడ చౌకీదారు మంచి మనిషి. దక్షిణం నుండి వచ్చినోడు. విచారాలు మర్చిపోవాలంటూ తప్పతాగుతుండేవాడు. రైలెప్పుడు వస్తుందో నాకెప్పుడూ తెలిసేది కాదు. కాని చౌకీదారుకు తెలుసు. వచ్చేముందు నాకు సైగ చేసేవాడు. నేను గేటుమూసి, రైలు పోయినాక మళ్ళీ తీసేదాన్ని. రోజులట్లా గడిచాయి. చౌకీదారు వెళ్ళిపోయాడు. చచ్చిపోయాడన్నారెవరో.

ఇవాళ, ఈ మంచె మీది నుంచి, ఇదంతా ఎందుకు చెప్తున్నాను? నాకు ఎవరి మీదా ఫిర్యాదుల్లేవు. పైగా దేనికైనా ఒక టైముంటుంది. మమ్మల్ని రెండువేల ఏళ్ళ నుంచి అణగదీస్తున్నారని ఇప్పుడు ఫిర్యాదు చేయగలమా? పైగా మానవజాతి ముందుకు పోతుంటే కొన్ని బలిదానాలు తప్పవు. పైగా బలిదానాలు ఏవో కొద్దిరోజులు జరిగేవి కావు. ఎవరో కొద్దిమంది చేసేవికావు. రెండువేల ఏళ్ళ క్రితం రాజులు మరిన్ని శిస్తులకోసం, పేరు కోసం యుద్ధాలు చేసారు. యుద్ధాలు అయినాక చచ్చిన జనాన్ని చూసి వారికి చీమకుట్టినట్లయినా ఉండేదికాదు. అయితే అది బలిదానం కదా! రాజులు, మహా రాజులు తాము సర్వంసహాధిపతులమని బిరుదులు పొందేందుకూ, మూడు కళింగాల రాజులు, తొమ్మిది కోట్ల మంది ప్రజల ప్రభువులు సుఖశాంతులతో జీవించేందుకూ మేము మా భూములు, ఇళ్ళు వదలి కొండల్లోకి, అడవుల్లోకి పోతే అది కూడా త్యాగమే మరి.

నా జీవితంలో జరిగినవీ త్యాగాలే. అవి, ఒక తెగ ప్రజలు చేసిన త్యాగాలకు ఉదాహరణలు. అయినా మనసులో అనుమానం ఒకటి మెదులుతున్నది. ఇపుడు నా ఎదుట ఎవరూ లేరు. అడవిలేదు. మనుషులు లేరు. కుందేళ్ళు, ఆవచేలు, దేవత, దయ్యాలు ఏవీలేవు. వయసులో ఉన్న ఆడపిల్లలు పాడటం, ఆడటం ఏదీ కనపడదు. ఆడ- మగపిల్లల నవ్వులాటలు, ఎకసక్కాలు లేవు. నా ముందు సంతోషంగా ఉన్నవారు లేరు, విచారంగా ఉన్నవారు లేరు. దూరంగా, చెట్లన్నీ పోయి బోడిగా మారిన కొండల దగ్గర, పొదల్లో మాలల్లాగా మండుతున్న మంటల వరసలు మాత్రం కన్పిస్తున్నాయి. జనవరిలో చలిగాలి ఆ బోడికొండలను ఎలా తగిలి రగులుతుందో చూసి అనుభవించేందుకు మాత్రం అక్కడ ఎవరూ లేరు. మరి, నాగరికత అనేది నిజంగా ఎక్కడుంది? ఈ త్యాగాలు బలిదానాలు ఎవరి కోసం చేసినట్టు?

మా అరవై కుటుంబాల్లోంచి ఈ నాగరికతను చూసేందుకు ఒక్క మగపిల్లాడైనా, ఒక్క పసిపిల్లయినా మిగలలేదు. మరి ఈ నాగరికతకు అర్థమేమిటి? అయ్యలారా! అన్నలారా! అక్కలారా! నేను ఈ మాటొక్కటే అడుగుతున్నాను. నన్ను అపార్థం చేసుకోకండి. తిరుగుబాటుదారు అనకండి. మతిచెడిన ముసిలిదని తిట్టకండి. మీరేం చేసినా, ఎక్కడ చేసినా, ఒక క్షణం పాటు ఆగి నన్ను గుర్తు చేసుకుని, ఇదంతా ఎందుకోసం జరిగిందంటూ ఒక్కసారి ప్రశ్నించుకొమ్మని మాత్రమే నేను వినయంగా వేడుకొంటున్నాను.

అయినా, నేనింత మాట్లాడుతున్నది ఎవరితో? ఈ కంఠశోషని గాలి వింటుందా? బోడివైపోయి, బూడిదరంగుకు మారిన కొండలపై తిరుగాడే గాలా? బహుశా వినదు. అయినా ఏదో ఆశ. ఎవరైనా విని ఏదైనా చేస్తే చేస్తారేమోనని.